సాక్షి
వికారాబాద్
బుధవారం ׀ 22 ׀ నవంబర్ ׀ 2023



నిత్యం నిఘా

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బొంరాస్‌పేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.
10లో▸



చేయి చేయి కలుపుతూ..

కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలకు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జీఎంఆర్ చెక్ పెట్టారు. అందరినీ కలుపుకుపోతున్నారు.
10లో▸



కాంగ్రెస్ వస్తే ఆగమైతం

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆగమైతమని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు.
11లో▸

న్యూస్‌రీల్

రేపు సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ సత్య సాయి జ్ఞానకేంద్రంలో గురువారం సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జ్ఞానకేంద్రం ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు , ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. బాబా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమన్వయంతో పనిచేయండి: ఎస్పీ కోటిరెడ్డి



పరిగి: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. పరిగి పట్టణ కేంద్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులతో మంగళవారం ఎస్పీ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రూట్ మొబైల్ అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులతో సమన్వయం చేస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. సున్నితమైన, అతి సున్నితమైన గ్రామాల్లో బందోబస్తు నిర్వహించే అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. సీసీ టీవీ పర్యవేక్షణలో పోలింగ్ జరుగుతున్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. సోషల్‌మీడియాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోటోలు, వీడియోలు, ప్లకార్డుల పోస్టింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అన్నిశాఖల అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.


గెలుపే లక్ష్యంగా శ్రమించండి: ఎంపీ



రంజిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

మర్పల్లి: మరో వారం రోజులు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పార్టీకోసం కష్టపడితే విజయం మనదేనని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మర్పల్లిలోని బీఆర్ఎస్ పార్టీ బూత్‌లెవల్ కార్యకర్తలకు (సభ్యులకు) మంగళవారం ఎన్నికల విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బూత్‌లెవల్ కార్యకర్తలు వికారాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆనంద్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతి బూత్‌లెవల్ కార్యకర్తకు పోటీ చేస్తున్న సభ్యుల సంఖ్యతో కూడిన పార్టీ గుర్తులు కలిగిన నమూనా బ్యాలెట్‌ను అందజేశారు. అనంతరం మండల పరిధిలోని దామస్తాపూర్‌కి చెందిన 30 మంది కార్యకర్తలు ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మధుకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్ గుప్తా, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ ప్రసిడెంట్ మధుకర్, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌస్, రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, మర్పల్లి ఎంపీటీసీ వసంత్, నాయకులు పాల్గొన్నారు.

రూ.40 లక్షల నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదును చూపిస్తున్న సీఐ రాజేందర్ రెడ్డి

తాండూరు టౌన్: బైక్‌పై ఇద్దరు వ్యక్తులు రూ.40 లక్షల నగదు తీసుకెళ్తుండగా తాండూరు పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాలు.. పెద్దేముల్ మండలం మారేపల్లిలోని సుమిత్రా కాటన్ మిల్లు సిబ్బంది వినయ్ గార్గ్, వీరారెడ్డి మంగళవారం బైక్‌పై రెండు బ్యాగుల్లో రూ.40 లక్షల నగదు తీసుకెళ్తున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా నగదు లభించింది. ఈ నగదును సీజ్ చేసి స్క్రీనింగ్ కమిటీ సభ్యులకు అందజేసినట్లు చెప్పారు. పూర్తి విచారణ అనంతరం.. సరైన ఆధారాలు చూపిస్తే నగదు తిరిగి ఇచ్చేస్తామని సీఐ తెలిపారు.

● ఇస్త్రీ చేస్తా.. ఆనంద్‌కు ఓటేయండి



ప్రచారంలో భాగంగా కొత్లాపూర్‌లో ఇస్త్రీ చేస్తున్న బీఆర్ఎస్ వికారాబాద్ అభ్యర్థి ఆనంద్ సతీమణి సబిత

● మా మద్దతు మీకే..



తాండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డికి మద్దతుగా ఉంటామని గులాబీ పార్టీలో చేరిన నాయకులు, మహిళలు

● గెలిపించు వేంకటేశ్వరా..



అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ పరిగి అభ్యర్థి మహేశ్‌రెడ్డి.. వేంకటేశ్వరస్వామి ఆలయంలో చండీయాగం నిర్వహించారు

జిల్లాకు గులాబీ దళపతి

- నేడు, రేపు నాలుగు నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ పర్యటన
- భారీ జన సమీకరణలో అభ్యర్థులు
- హామీలపై సర్వత్రా ఆసక్తి



తాండూరు: సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు/పరిగి/వికారాబాద్: జిల్లాలోని తాండూరు, కొడంగల్, పరిగి నియోజవకర్గాల్లో బుధవారం నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం వరకు సీఎం పర్యటన కొనసాగనుంది. బీఆర్ఎస్ అభ్యర్థులు రోహిత్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి మంగళవారం సభా ప్రాంగణాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. తాండూరులోని విలియంమూన్ పాఠశాల మైదానంలో ఉదయం 11.30 గంటలకు సీఎం కేసీఆర్ మొదటి సభ ప్రారంభం కానుంది. సభకు హాజయ్యే వారికి తాగునీరు, తదితర సౌకర్యాలను సమకూరుస్తున్నారు. సభకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి లక్ష మంది జన సమీకరణ చేయాలని ప్రణాళిక రచించారు. నేడు జరగనున్న సభలో కంది బోర్డు విషయంలో సీఎం కేసీఆర్ కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. అనంతరం కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కోస్గిలో నిర్వహించే భహిరంగ సభలో సీఎం పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు పరిగిలో నిర్వహించే భహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు.

ఏర్పాట్ల పరిశీలన..

పరిగిలో సీఎం కేసీఆర్ హాజరయ్యే ప్రజా ఆశీర్వాద సభకు గులాబీ నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కొడంగల్ రోడ్డు జింఖానా గ్రౌండ్‌లో సభావేదికను మంగళవారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరిశీలించారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి సభా స్థలాన్ని పరిశీలించి బందోబస్తుపై సమీక్షించారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో వస్తుండటంతో తుంకుల్‌గడ్డ సమీపంలో హెలిపాడ్‌ను ఏర్పాటు చేశారు. హెలిపాడ్ స్థలం నుంచి నేరుగా ఎలాంటి ట్రాఫిక్ లేకుండా 2 కిలోమీటర్ల మేర సీఎం సభా స్థలానికి రావడానికి ఏర్పట్లు చేశారు. సీఎం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

రేపు వికారాబాద్‌లో..

వికారాబాద్‌లో గురువారం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారు. రెండు రోజులు వరుసగా జిల్లాలో గులాబీ బాస్ పర్యటించనున్న నేపథ్యంలో ఈ పర్యటనలను అధికార పార్టీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో సమావేశానికి 50వేల నుంచి 60వేల వరకు జన సమీకరణ చేపట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకు ద్వితీయ శ్రేణి నాయకులకు, కార్యకర్తలకు ఇప్పటికే బాధ్యతలు అప్పగించారు.



పీఓ, ఏపీఓలకు సూచనలు చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రీపోలింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

పీఓ, ఏపీఓలతో కలెక్టర్ నారాయణరెడ్డి సమీక్ష

పరిగి: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం పరిగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఓ, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సలహాలు, సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ నియమావళిని అనుసరించి విధులను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన హ్యాండ్ బుక్‌లెట్స్‌ను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధానాన్ని ఎలాంటి తప్పులు జరగకుండా చేపట్టాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. రీపోలింగ్‌లకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా పోలింగ్ ముగించాలన్నారు. అనంతరం ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్ల కోసం అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ విజయకుమారి, మ్యాన్‌పవర్ నోడల్ అధికారి దీపారెడ్డి, అధికారులు చక్రపాణి, ఎంఆర్‌ఓ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనలోనూ వివక్షే

- జిల్లాలో 42మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు
- గత ఎన్నికల్లో జీరో ఓటింగ్ నమోదు
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం



వికారాబాద్: అనాదిగా సమాజంలో ట్రాన్స్ జెండర్స్ విషయంలో వివక్ష కొనసాగుతూనే ఉంది. కనీసం వారిని సాటి మనిషి కూడా గుర్తించని పరిస్థితి మన పరిసరాల్లో ఉంది. అనేక పోరాటాల ఫలితంగా 2014 ఏడాదిలో జరిగిన ఎన్నికల్లో మొదటిసారిగా ఓటరు జాబితాలో ట్రాన్స్ జెండర్స్‌ను ఎన్నికల కమిషన్ చేర్పించింది. వారిని ఓటరు జాబితాలో పురుషులు, స్త్రీలు కాకుండా ఇతరులుగా పేర్కొంది. అయితే ఆ గుర్తింపు వారికి కేవలం ఓటరు జాబితాలో పేరు నమోదు వరకే పరిమితమయ్యింది. ఎన్నికలవేళ వారికి అవగాహన కల్పించి ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రోత్సహించడపై యంత్రాంగం దృష్టిసారించడం లేదంటూ విమర్శలు ఉన్నాయి.

2018లో జీరో ఓటింగ్...

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికారాబాద్ జిల్లాలో మొత్తం 67 మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లను అధికారులు గుర్తించారు. ఇందులో పరిగి నియోజకవర్గంలో 14 మంది, వికారాబాద్‌లో 14 మంది, తాండూరులో 11 మంది, కొడంగల్‌లో అత్యధికంగా 28 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నట్లు జాబితాలో చూయించారు. అయితే 2018 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా వీరిలో ఒక్కరంటే ఒక్కరు కూడా తమ ఓటుహక్కును వినియోగించుకోలేదు. ముంబాయి, ఢిల్లీ, హైదరాబాద్ లాంటి నగరాల్లో ట్రాన్స్ జెండర్స్ ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీచేసి గెలవటం వరకు కూడా వచ్చిన తరుణంలో మన జిల్లాలో కనీసం పోలింగ్ బూత్ వరకు కూడా రాకపోవటం చూస్తుంటే వారి ఓటింగ్‌పై అధికారులకు ఉన్న అశ్రద్ధ తేటతెల్లం అవుతోంది.

ఈ ఏడాదైన..

ఇటీవల ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటరు తుది జాబితా ప్రకారం జిల్లాలో 42 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పరిగి నియోజకవర్గంలో 07, వికారాబాద్‌లో 13 మంది, తాండూరులో 10 మంది, కొడంగల్‌లో 12 మంది ఉన్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసీ ఓటరు అవగాహన విషయంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చింది. వీటిని జిల్లా యంత్రాంగం కూడా ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకువెళ్తోంది. ఇందులో భాగంగానే సీ-విజిల్ యాప్ ప్రవేశపెట్టడం, ప్రతి గ్రామానికి వెళ్లి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై అవగాహన కల్పించారు. నాలుగు రకాల పోస్టల్ బ్యాలెట్‌ను ప్రవేశపెట్టి ఉద్యోగులు, ప్రత్యేక ప్రతిభావంతులు, సర్వీస్ ఓటర్లు, వయోవృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో ట్రాన్స్‌జెండర్లను పోలింగ్ బూత్‌ల వరకు రప్పించి వారు తమ ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తారా..? లేదా అనేది వీరి ఓటింగ్ నమోదు అనంతరం తేలనుంది.

అప్పుల తెలంగాణగా మార్చారు

- అవినీతి సొమ్మును పంచి గెలవాలని చూస్తున్నారు
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్
- ఎమ్మెల్యే, ఎంపీ, బీఆర్ఎస్ నేతలపై తీవ్ర ఆరోపణలు



గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మోమిన్‌పేట: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే బంగారు తెలంగాణ చేస్తామని చెప్పిన కల్వకుంట్ల కుటుంబం అప్పుల తెలంగాణగా మార్చారని కాంగ్రెస్ వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాల్‌రెడ్డిగూడెం, చీమల్‌దరి, చక్రంపల్లి, దేవరంపల్లి, ఏన్కతల, టేకులపల్లి, మక్తాతండా తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. కాంగ్రెస్ గెలిచిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి.. తిరిగి రూ.3 లక్షల రుణం ఇస్తామని స్పష్టంచేశారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు, మహిళలకు రూ.2,500 పెన్షన్‌తో పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు.

అవినీతి సొమ్ముతో అడ్డదారులు

చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కోళ్ల దాణాలో రూ.300 కోట్ల కుంభకోణం చేశాడని ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. అవినీతి సొమ్మును ఎన్నికల్లో ఖర్చు చేసి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేస్తున్నాడని ఆందోళన వ్యక్తంచేశారు. గత పదేళ్లుగా తనతో ఉండి.. తన ఓటమికి శాయశక్తులా కృషిచేస్తున్న చీమల్‌దరి సర్పంచ్ నర్సింహారెడ్డి చేసిన భూ కబ్జాలు తనకు తెలుసన్నారు. అవినీతి సొమ్ములతో గుడులు నిర్మిస్తే.. చేసిన పాపాలు పోతాయా..? అని ప్రశ్నించారు. ప్రస్తుత ఎమ్మెల్యే(ఆనంద్), నర్సింహారెడ్డి, ఎంపీపీ వెంకట్ భూ కబ్జాలు చేసి అడ్డగోలుగా సంపాదించారని ధ్వజమెత్తారు. తనను ఓడించడానికి వారు (నర్సింహారెడ్డి, వెంకట్) పాము పగపట్టినట్లు పగ పట్టారని తెలిపారు. ఎంతమంది ఏకమైనా తన గెలుపును ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు నరోత్తంరెడ్డి, మహేందర్‌రెడ్డి, మహంత్ స్వామి, అజం, అనందం, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, భుజంగ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటమి తప్పదనే..



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత నర్సింహారెడ్డి

మోమిన్‌పేట: మూడోసారి ఓటమి తప్పదని గుర్తించిన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత, చీమల్‌దరి సర్పంచ్ నాసస్‌పల్లి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మోమిన్‌పేటలో విలేకరులతో మాట్లాడారు. ప్రసాద్‌కుమార్ తనపై చేసిన వ్యక్తిగత ఆరోపణలను ఖండించారు. ప్రసాద్ కుమార్ మంత్రిగా ఉన్న సమయంలో తమ గ్రామాభివృద్ధికి రూ.10 లక్షలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. తమ గ్రామానికి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు రావడాన్ని జీర్ణించుకోలేక వ్యక్తిగత విమర్శలకు దిగడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. తనతో పాటు తమ పార్టీ పెద్దలపై చేసిన ఆరోపణలన్నీ ఆయనకే వర్తిస్తాయని ఎద్దేవాచేశారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక నిరాధార ఆరోపణలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆయన మంత్రిగా ఉన్న రోజుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, బదిలీలు చేయిస్తానని చెప్పి ఎవరివద్ద ఎంత తీసుకున్నాడో.. తన వద్ద సాక్ష్యాధారాలున్నాయని తెలిపారు. వికారాబాద్‌లో ఉన్న భూమిని నలుగురికి అమ్మి.. అడ్వాన్సులు తీసుకుని బెదిరించిన సంగతి నిజం కాదా..? అని ప్రశ్నించారు. స్థానికుల సహకారంతోనే తమ గ్రామంలో గుడి నిర్మించుకున్నామని వివరించారు. తాను ఒక్క గుంట భూమిని కబ్జా చేసినట్లు నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని తెలిపారు. ఎంపీ రంజిత్‌రెడ్డి రూ.300 కోట్లు కాదు కదా.. రూ.30 అవినీతి చేసినట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. ఆయన చెప్పినవన్నీ నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరనే విషయం గుర్తించాలని సూచించారు. ఇకనైనా వ్యక్తిగత విమర్శలను మానుకోకపోతే ఆయన బండారం అంతా బయట పెడుతామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం



తిరుపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కొడంగల్‌లో జోరుగా నేతల ప్రచారం

కొడంగల్: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవంత్‌రెడ్డి తరఫున ఆ పార్టీ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. మండల పరిధిలోని రావులపల్లిలో మంగళవారం కర్నాటక రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శరణ ప్రకాశ్ ఇంటింట ప్రచారంలో పాల్గొన్నారు. పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, రేవంత్ సోదరుడు కృష్ణారెడ్డి, రావులపల్లి సర్పంచ్ రమేష్‌రెడ్డి తదితరులు రేవంత్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే సమన్యాయం సాధ్యమన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి రేవంత్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు.

రేవంత్‌కు అన్నివర్గాల మద్దతు..

కాంగ్రెస్ పార్టీకి దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ, వెనుకబడిన వర్గాల మద్దతు ఉందని ఆ పార్టీ ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు విజయరాజు అన్నారు. మంగళవారం కొడంగల్ పట్టణంలోని రేవంత్ నివాసంలో ఆయన మాట్లాడారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డికి అన్నివర్గాల మద్దతు ఉందని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, డాక్టర్ చంద్రశేఖర్, కృష్ణ, వీరు, అంజి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



బుద్లాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, నాయకులు

దోమ: కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న అమలుకాని హామీలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని.. ప్రజలు మరోసారి బీఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. త్వరలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా పరిగి నియోజకవర్గానికి సాగునీరు రాబోతున్నాయని తెలిపారు. కారు గుర్తుకు ఓటువేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ నాగిరెడ్డి, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలు వివరించండి

- ప్రజా ఆశీర్వాద సభకు జనసమీకరణ చేపట్టండి
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

ధారూరు: పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి సీఎం కేసీఆర్ హాజరవ్వనున్న ప్రజా ఆశీర్వాద సభకు భారీగా జనాన్ని సమీకరించాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రానున్న ప్రభుత్వం ప్రతీ దళిత, మైనార్టీ, బీసీకి లబ్ధిచేకూరేలా సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాలను బూత్ ఇన్‌చార్జీల వాట్సాప్ గ్రూప్‌లకు పంపుతామని.. మీరు అందుకనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. సీఎం సభకు ప్రతిపక్షాల దిమ్మ తిరిగేలా జనసమీకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, పార్టీ నాయకులు వడ్ల నందు, రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, హఫీజ్, వెంకటయ్య, మోయిజ్ ఖురేషి, బాల్‌రాజ్‌నాయక్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

'కారె'క్కండి

తమ్మలి బాల్‌రాజ్‌తో మంత్రి పట్నం మంతనాలు



మంత్రిని సన్మానిస్తున్న బాల్‌రాజ్

కొడంగల్: వైఎస్సార్ టీపీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తమ్మలి బాల్‌రాజ్‌తో మంత్రి మహేందర్‌రెడ్డి మంగళవారం మంతనాలు జరిపారు. కోస్గి మండలం ముక్తిపాడ్ గ్రామానికి వెళ్లి ఆయన నివాసంలో కలిశారు. బీఆర్‌ఎస్‌లో చేరి పట్నం నరేందర్‌రెడ్డికి గెలుపునకు కృషి చేయాలని కోరారు. భవిష్యత్తులో బీఆర్‌ఎస్ అన్ని విధాలుగా అవకాశం కల్పిస్తుందని భరోసా కల్పించారు. బుధవారం కోస్గిలో నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభలో బీఆర్‌ఎస్‌లో చేరాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి.

'గ్యారెంటీ'గా అన్ని వర్గాల సంక్షేమం



మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

మీర్‌పేట: అన్ని వర్గాల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలను ప్రకటించిందని పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట గాయత్రీనగర్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలంతా కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారని.. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమని జోస్యం చెప్పారు. మహేశ్వరంలో హస్తం గుర్తుకు ఓటు వేసి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, మాజీ ఎంపీపీ కందాళ బాబు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ కొప్పుల ప్రవీణ్‌కుమార్, ఎడ్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా

ఎన్నికల వేళ ప్రలోభాలను అడ్డుకోవడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని ఏడు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

- సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ
- ఏడు గ్రామాల్లో 33 సీసీ కెమెరాల ఏర్పాటు

గ్రామం	సీసీ కెమెరాల సంఖ్య
బొంరాస్‌పేట	3
తుంకిమెట్ల	3
రేగడిమైలారం	2
ఎన్కేపల్లి	2
వడిచర్ల	4
మహంతీపూర్	3
దుద్యాల	16
మొత్తం	33



పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల వీడియోల నమోదు

బొంరాస్‌పేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి–163 వెంటనున్న గ్రామాలైన తుంకిమెట్ల, రేగడిమైలారం గ్రామాలతో పాటుగా ఎన్నికల సంఘం సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన వడిచర్ల, ఎన్కేపల్లి, మహంతీపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసి నిరంతం టీవీలో పర్యవేక్షిస్తున్నారు. ఈ సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండటం, మద్యం మత్తులో అల్లర్లు జరగకుండా, డబ్బులు, మద్యం రవాణా అరికట్టడం, గ్రామాల్లో పోలీసు బందోబస్తును తగ్గించడం, నిశ్పక్షపాతంగా నిఘా ఉంచడం వంటి మేలు చేకూరుతోంది.

అంతా ప్రశాంతం



పోలీసు స్టేషన్ పరిధిలోని రెండు మండల కేంద్రాల్లో జాతీయ రహదారిపై ఉన్న గ్రామాలు, సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు ఎలాంటి సమస్యలు నమోదు కాలేదు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి సైతం ఎలాంటి రిమార్కులు రాలేదు.

–శంకర్, ఎస్ఐ, బొంరాస్‌పేట



కాంగ్రెస్ అంటేనే స్వేచ్ఛ అని సొంత పార్టీ నేతలు.. వర్గ పోరు అంటూ ప్రతిపక్షాలు విమర్శిస్తుంటాయి. ఇందుకు భిన్నంగా కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్న బీఎంఆర్ తాండూరులో అసమ్మతి వర్గాన్ని తనవైపు తిప్పుకోవడంలో సక్సెస్ అయ్యారు.

చేయి చేయి కలుపుతూ..



డాక్టర్ సంపత్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న మనోహర్‌రెడ్డి

- కాంగ్రెస్ అసమ్మతి వర్గానికి బీఎంఆర్ చెక్
- అందరితో కలిసి ప్రచారం చేస్తున్న మనోహర్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంటుంది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు మూడు వర్గాలుగా విడిపోయిన నాయకులను ఒకే గొడుగు కిందకు తీసుకోరావడంలో కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి సక్సెస్ అయ్యారనడంలో అతిశయోక్తి లేదు. పక్షం రోజుల క్రితం వరకు అసమ్మతి రాగం వినిపించిన నాయకులను బీఎంఆర్ కలిసి అందరివాడు అనిపించుకున్నారు.

హస్తానిదే హవా..

తాండూరు నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి హస్తానిదే హవా.. దేశ, రాష్ట్ర రాజకీయాలకు సంబంధం లేకుండా తాండూరు ఓటర్లు విలక్షణ తీర్పు నిస్తుంటారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న తాండూరు అసెంబ్లీ నుంచి ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి బరిలోకి దిగారు. నెల రోజుల క్రితం వరకు ఏఐసీసీ సభ్యుడు రమేశ్‌మహరాజ్ వర్గం ఓ వైపు, డాక్టర్ సంపత్‌కుమార్ వర్గాలుగా చీలి టికెట్ కోసం పోటీ పడ్డారు. అయితే తాండూరు టికెట్ ఆశించిన కేఎల్‌ఆర్‌కు మహేశ్వరం టికెట్ వరించింది. దీంతో బుయ్యని మనోహర్‌రెడ్డికి లైన్ క్లియర్ అయింది. నియోజకవర్గంలో పార్టీలో అంతర్గత విబేధాలు నెలకొన్నాయి. బీఎంఆర్ అసమ్మతికి తావులేకుండా అందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీ గెలుపుకు పనిచేసేలా తనవైపు తిప్పుకోవడంలో తొలివిజయం సాధించారు.

చేరికలతో బలం

తాండూరులో నాలుగేళ్లుగా కాంగ్రెస్ కేడర్ అస్తవ్యస్తంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికలలో గెలుపుకు పని చేసినవారంతా సింహభాగం కారెక్కారు. సీనియర్ నాయకుడు డాక్టర్ సంపత్‌కుమార్ కాంగ్రెస్ నాయకులను ఏకతాటిపైకి తెచ్చేందుకు చేసిన కృషి ఫలించింది. మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ టౌన్ మాజీ అధ్యక్షుడు రవూఫ్, పట్లోళ్ల నర్సింలు, బాల్‌రెడ్డి వంటి నేతలు కాంగ్రెస్‌లోకి రావడంతో మనోహర్‌రెడ్డి శిబిరం బలంగా మారింది.

కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి

బీఆర్‌ఎస్ షాద్‌నగర్ అభ్యర్థి అంజయ్యయాదవ్



గజమాలతో అంజయ్యయాదవ్‌కు స్వాగతం పలుకుతున్న జంగోనిగూడ గ్రామస్తులు

నందిగామ: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అడ్డుపడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ షాద్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని జంగోనిగూడ, అంతిరెడ్డిగూడ, నర్సప్పగూడ, వెంకమ్మగూడ, చేగూరు, బండోనిగూడ తదితర గ్రామాలలో ప్రచారాన్ని చేపట్టారు. ఆయా గ్రామాలలో రోడ్ షో, ర్యాలీలలో అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు సమయంలో అసత్య ప్రచారాలతో తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పోరాట పటిమతోనే రాష్ట్రం సిద్ధించిందన్నారు. రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మరోసారి అధికారం ఇవ్వాలని కోరారు. గ్రామాలు అభివృద్ధిలో పట్టణాలకు తీసిపోకుండా ఉన్నాయన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్ రెడ్డి, సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, గోవిందు అశోక్, సంతోష, రజనీత, కుమార్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, ఎంపీటీసీ సభ్యురాలు కలమ్మ, ఉప సర్పంచ్‌లు శేఖర్, కుమార్ గౌడ్, నాయకులు నారాయణ రెడ్డి, నీలమ్మ, విజయ్, నీరటి సురేందర్, కుమార్, రాజేందర్, సుదర్శన్ గౌడ్, రమేష్, నర్సింహ, సురేశ్, శ్రీనివాస్ గౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, యాదయ్య, రాజు, శ్రీనివాస్, మల్లేశ్, శేఖర్, జనార్ధన్ రెడ్డి, విక్రం శర్మ, మాజీ సర్పంచ్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్ కాలం.. గందరగోళం



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న రామ్యనాయక్

ఎన్నికల వేళ పార్టీల నేతలు కండువాలు కర్వేపుల్లా మార్చేస్తున్నారు. ఆదిలో టికెట్లు ఆశించి భంగపడిన నేతలతో మొదలైన వలసలు పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ ద్వితీయ శ్రేణి నాయకులు సైతం అదే బాటలో నడుస్తున్నారు. తాజాగా మంగళవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు.. రామ్య నాయక్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న సొసైటీ డైరెక్టర్, యాలాల అధ్యక్షుడు శ్రీహరి కారు దిగి ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. – యాలాల



శ్రీహరిని కాంగ్రెస్‌లోకి స్వాగతిస్తున్న మనోహర్‌రెడ్డి

పోలీసులు ముందే ఓటేశారు



ఇబ్రహీంపట్నం: ఎంపీడీఓ కార్యాలయంలో ఓటేస్తున్న పోలీస్



ఇబ్రహీంపట్నం: పోలింగ్ కేంద్రం వద్ద నాయకుల హడావుడి

- 1214 మందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
- ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం
- మొదటి రోజు ఓటుహక్కు వినియోగించుకున్న 364 మంది ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 1214 మంది ఓటర్లు పోలీస్ శాఖల్లో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. ఎన్నికల సంఘం వారికి మంగళ, బుధవారాల్లో పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. ఇబ్రహీంపట్నంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వారు ఓటేశారు. మొదటి రోజు 364 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. బుధవారం ఓటేసేందుకు అవకావం ఉందన్నారు.

ఓటర్లకు ప్రలోభాలు

ఫెసిలిటేషన్ సెంటర్ సమీపంలో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేయాలని ఆయా పార్టీ శ్రేణులు ఓటర్లను ప్రక్కకు తీసుకెళ్లి తమ అభ్యర్థులకు ఓటు వేయాలని డబ్బులు పంపిణీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పోలింగ్ రోజు పార్టీ శ్రేణుల ప్రచారం మాదిరిగానే మంగళవారం ఫెసిలిటేషన్ సెంటర్ పరిసరాల్లో కనిపించడం గమనార్హం.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వినియోగం

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచి ప్రారంభించిన ఈ పోలింగ్‌లో 261 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. పోలీసులకు సంబంధించి 971 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు కలిగి ఉండగా అందులో 261 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. హోం ఓటింగ్‌లో భాగంగా సీనియర్ సిటిజన్లు 177 మంది ఉండగా 160 మంది ఓటు వేశారని తెలిపారు. దివ్యాంగులకు సంబంధించి 54 మంది ఓటర్లు ఉండగా 49 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వివరించారు. పోస్టల్ ఓటింగ్ ఉపయోగించుకునే పోలీసు ఉద్యోగులకు బుధవారం కూడా అవకాశం ఉంటుందని చెప్పారు.

వారు ఇంటి వద్ద వేశారు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నిర్వహించిన హోం ఓటింగ్‌లో సోమ, మంగళవారాల్లో 45 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రానికి రాలేని వృద్ధులు, 40శాతంకు పైగా వైకల్యం ఉన్న దివ్యాంగుల కోసం రాష్ట్రంలో తొలిసారిగా హోం ఓటింగ్ విధానం తీసుకువచ్చారు. నియోజకవర్గంలో 52 మందిని అర్హులుగా గుర్తించగా... మూడు బృందాలు హోం ఓటింగ్‌ను నిర్వహించాయి. ఇందులో 45 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా అరుగురు అందుబాటులోకి లేరని, మరొకరు చనిపోయినట్లు అనంతరెడ్డి తెలిపారు. ఓటు వేయని వారికి మరో అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు.

'కారు'కు ఓటేస్తే అసైన్డ్ భూములు మాయం

- మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



ఆరు గ్యారెంటీలను వివరిస్తున్న మంజుల

వికారాబాద్ అర్బన్: సీఎం కేసీఆర్‌ను నమ్మి కారు గుర్తుకు ఓటేస్తే ప్రభుత్వ భూములతో పాటుగా అసైన్డ్ భూములు లాక్కొంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్ అన్నారు. మంగళవారం ఆమె మద్గుల్ చిట్టంపల్లి 8,9 వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ శ్రేణుల మాటలు నమ్మి ఓటేస్తే మోసపోతామన్నారు. ఇప్పటికే పీర్లదర్గా వద్ద గ్రామానికి చెందిన కొందరు రైతుల నుంచి భూములు లాక్కొని ప్రభుత్వ భవనాలు నిర్మించారన్నారు. మరోసారి అవకాశమిస్తే మిగిలిన రైతుల భూములు మాయమవ్వడం ఖాయమన్నారు. మద్దులగడ్డ తండాలో గిరిజనులు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను సైతం బీఆర్‌ఎస్ సర్కార్ అమ్మేస్తుందని ఆరోపించారు. మద్గుల్ చిట్టంపల్లిలో ప్రభుత్వ భూమి ఎంతుందో ఎమ్మెల్యే సేకరించి పెట్టారన్నారు. అసైన్డ్ భూమిలో పంట సాగు చేస్తూ జీవనం సాగించాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్ గెలుపుతోనే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అధికారం మనదే



కేతిరెడ్డిపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్: ముచ్చటగా మూడోసారి అధికారం మనదేనని.. ప్రజలంతా కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య కోరారు. మంగళవారం ఆయన మండలపరిధిలోని కేతిరెడ్డిపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఇతర పార్టీల నేతలు స్వచ్ఛందంగా గులాబీ పార్టీలో చేరుతున్నారన్నారు. అనంతరం సర్పంచ్ శోభారెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్లలో కాలె యాదయ్య హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అనంతరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు శ్రీహరియాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుఫ్, మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ విఫలం

జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



జీపీ కార్మికులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని పంచాయతీ కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలలుగా కార్మికులకు జీతాలు రావడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉండి కార్మికుల సమస్యలను గాలికొదిలేసిందని ఆయన ఆరోపించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సమ్మె చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జీపీ కార్మికుల సమస్యలపై సానుకూలంగా ఉన్న పార్టీకే మా మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, రాంచంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.